
కోనరావుపేట : కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


గంభీరావుపేట : కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు


ఎదుర్కోలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

ఘనంగా గోదా రంగనాథుల కల్యాణం

కోనరావుపేట: సుద్దాల, కొండాపూర్ గ్రామాల్లో గోదా రంగనాథ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సుద్దాలలోని చెన్నకేశవస్వామి ఆలయం, కొండాపూర్‌లో రంగనాయకుల స్వామి దేవాలయంలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కృష్ణమాచార్యులు కృష్ణ, సర్పంచ్ దేవయ్య, శివాలయ ధర్మకర్త మండలి సభ్యులు శ్రీనివాస్, రాజిరెడ్డి, శంకర్, పూండ్ర రాజిరెడ్డి, మామిడి ప్రభాకర్ రెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలకేంద్రంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో గోదారంగనాథుల కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కల్వకుంట్ల రాజేశ్వర్‌రావు, వజ్రమ్మ దంపతులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నార

ముస్తాబాద్: మండలంలోని గూడెంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా రంగనాథ స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయకమిటీ బాధ్యులు స్వామివారి ఎదుర్కోలునిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సరిత, ఎంపీటీసీ శ్రీధర్, ఉపసర్పంచ్ శ్రీధర్, ఏఎంసీ మాజీచైర్మన్ అంజన్‌రావు, డైరెక్టర్ బాలమల్లు, శ్రీ నివాస్ రావు, గిరి, ఎల్లాగౌడ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్ర రవాణాశాఖ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను శనివారం హైదరాబాద్‌లో గౌడ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కల్లు గీత వృత్తిదా రుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గౌడసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్, సిరిసిల్ల సింగిల్ విండో చైర్మన్ దేవదాస్‌గౌడ్, తదితరులున్నారు.

సీఎం పీఆర్వోను కలిసిన టీఎన్జీవోస్


సీఎం పీఆర్వో శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవోలు, నారాయణపూర్ గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట: ముఖ్యమంత్రి పీఆర్వో బొల్గం శ్రీనివాస్‌గౌడ్‌ను టీఎన్జీవో నాయకులు, నారాయణపూర్ గ్రామస్తులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. హైదరాబాద్‌లోని అతని నివాసంలో కలిసి శాలువాతో సన్మానించారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్‌కుమార్, నాయకులు బుగ్గ కృష్ణమూర్తి, గంట రవిగౌడ్, పర్శరాంరెడ్డి, పాములస్వామిగౌడ్, ఎల్లారెడ్డిపేట సింగిల్ విండో డైరెక్టర్ గోగూరి ప్రభాకర్‌రెడ్డి, షకీల్ కలిశారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

సిరిసిల్లటౌన్: మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు కోరారు. శనివారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. సిరిసిల్లకు చెందిన బీఆర్ఎస్ నేత, ఆయన సోదరుడు ఇరువురు మానేరు వాగు నుంచి యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

వీర్నపల్లి : మండలకేంద్రంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. 14 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా సెస్ డైరెక్టర్ మల్లేశం మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. సర్పంచ్ దినకర్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

తంగళ్లపల్లి: మండలకేంద్రంలో శనివారం టీపీఎల్ (తంగళ్లపల్లి) సీజన్–3 క్రికెట్ టోర్నీని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ పడిగెల మానసతో కలిసి ప్రారంభించారు. పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, నాయకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు

రుద్రంగి(వేములవాడ): మండలకేంద్రంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాతి వేడుకలు నిర్వహించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) జిల్లా ప్రచారక్ లోకేశ్ పండగ ప్రాముఖ్యతను వివరించారు. ఆర్ఎస్ఎస్ ప్రచారక్ సాయికృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ప్రభుత్వ జూ నియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, సర్పంచ్ శంకర్ అన్నారు. రాజన్నపేటలో ఎన్ఎస్ఎస్ శీతకాల శిబిరం ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పర్శరాములు, కార్యదర్శి రవి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

ముస్తాబాద్: మండలకేంద్రానికి చెందిన జంగం శంకర్ అనేరైతుకు చెందిన గడ్డివాము శనివారం దగ్ధమైంది. ముస్తాబాద్ శివారులో తన పొలం వద్ద నిల్వ ఉంచిన పశుగ్రాసం దగ్ధమైందని, రూ.25వేల నష్టం వాటిల్లినట్లు తెలిపాడు.

ఆకట్టుకున్న రంగవల్లులు


ఎల్లారెడ్డిపేటలో ముగ్గులు వేస్తున్న మహిళలు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల శ్రీనగర్ కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జడ్జిలుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ శోభారాణి, డాక్టర్ లీలా శిరీష వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందించారు. శ్రీనగర్ కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు, విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. ప్రతిభ చూపిన వారికి సర్పంచ్ బహుమతులు ప్రదానం చేశారు. ఉపసర్పంచ్ రజిత, ఎంపీటీసీ నాగరాణి, మహిళలు పాల్గొన్నారు.

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గులపోటీలు నిర్వహించారు. తెలుగు విభాగం, ఉమెన్ ఎంపవర్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పలువురు విద్యార్థులు ముగ్గులు వేశారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. విజయలక్ష్మీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. తెలుగు లెక్చరర్ పిట్ల దాసు, ఉమారాణి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ వాణి తదితరులు పాల్గొన్నారు.

‘అమలుకాని హామీలతో అధికారంలోకి కాంగ్రెస్’

తంగళ్లపల్లి: ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే కాంగ్రెస్‌కు ప్రజలనుంచి తిరుగుబాటు తప్పదని, సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిందని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆరోపించారు. ఇల్లంతకుంట మండలంలో శనివారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. కొత్త జిల్లాలను మారుస్తామంటే ఊరుకోబోమన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ జిల్లా అధక్షుడు తోట ఆగయ్య, జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనాథ్ గౌడ్, సెస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చర్ల నారాయణ, బీఆర్ఎస్వీ రాష్ట నాయకుడు జక్కుల నాగరాజు, నాయకులు రాజిరెడ్డి, చందన్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

రొడ్డ శ్రీకాంత్‌కు పరామర్శ..

ఇల్లంతకుంట మండలకేంద్రానికి చెందిన రొడ్డ శ్రీకాంత్ కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

‘మాల్దీవుల టూర్స్ బాయ్‌కట్’


మాల్దీవులను బాయ్ కాట్ చేస్తున్నట్లు ప్లకార్డులతో గగన్ విహార్ సంస్థ ప్రతినిధులు

సిరిసిల్ల: ప్రధాని మోదీపై మాల్దీవుల మంత్రుల అభ్యంతరకర వ్యాఖ్యలను ఖండిస్తూ.. మాల్దీవుల టూర్స్‌ను రద్దు చేసుకుంటున్నామని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ట్రావెల్ ఏజెన్సీ గగన్ విహార్ శనివారం ప్రకటించింది. సిరిసిల్లకు చెందిన అన్నల్‌దాస్ అజయ్‌కుమార్ ఈమేరకు మాల్దీవుల టూర్స్‌ను బాయ్‌కట్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఇప్పటికే మాల్దీవ్స్ పర్యాటక సంస్థలతో తాము కుదుర్చుకున్న పలు ప్యాకేజీలను రద్దు చేసుకున్నట్లు ప్రకటించారు. విహారయాత్రలకు వెళ్లాలనుకుంటున్న వారికి ‘స్వాభిమాన్ భారత్’ పేరిట మరింత డిస్కౌంట్‌తో లక్షద్వీప్ టూర్ ప్యాకేజీలను అందించనున్నట్లు వెల్లడించారు. తమలానే మరిన్ని ట్రావెల్ కంపెనీలు కూడా మాల్దీవ్స్ మంత్రులకు తగిన రీతిలో గుణపాఠం చెప్పాలని కోరారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


పార్టీలో చేరిన నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): జెడ్పీటీసీ పూర్మాని మంజుల రాంలింగారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని మల్లాపూర్, జిల్లెల్ల, రామచంద్రాపూర్, నర్సింహులపల్లె, బస్వాపూర్ గ్రామాలకు చెందిన పలు పార్టీల కార్యకర్తలు సుమారు 200 మంది శనివారం కాంగ్రెస్‌లో చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్ రెడ్డి సమక్షంలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, నాయకులు వైద్య శివప్రసాద్, ఎంపీటీసీ రాము, మునిగెల రాజు, తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల: పట్టణంలోని శివనగర్ 29వ వార్డుకు చెందిన కంది సంధ్య శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కామునిి వనిత, పట్టణ అధ్యక్షురాలు స్వరూపారెడ్డి, పార్టీ నాయకులు వైద్య శివప్రసాద్, జువ్వగం ప్రవీణ్ (టోనీ), శంకర్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సిరిసిల్ల: జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం 2024 టేబుల్ క్యాలెండర్‌ను కాంగ్రెస్ నాయకులు కేకే.మహేందర్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. తంగళ్లపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు పూర్మాని మంజుల, జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బలరాం, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, సిరిసిల్ల మండల సంఘం అధ్యక్షులు టీ.వీ.లక్ష్మణ్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, మండలసంఘం అసోసియేట్ అధ్యక్షులు బి.బాలమల్లయ్య, గౌరవా అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య, ముఖ్య సలహాదారు గడ్డం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

‘అధికారం లేకున్నా అహంకారం తగ్గలే’

సిరిసిల్లటౌన్: అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ నేతలకు అహంకారం తగ్గలేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ అధికార ప్రతినిధి కటుకం మృత్యుంజయం అన్నారు. శనివారం సిరిసిల్లలోని ని డీసీసీ కార్యాలయంలో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారును కూల్చుతామని కేటీఆర్ ప్రకటనలు చేయడం హాస్యాస్పదమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం లోపాలు, అక్రమాలు, వివిధ సంక్షేమ పథకాల్లో జరిగిన దోపిడీపై విచారణ జరిపించి బాధ్యులను శిక్షిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో అనుమతి లేని 150 స్టోన్ క్రషర్లు మూసేయాలని అధికారులకు సూచించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రకాశ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

అమృత్‘లాల్ సలాం’

- నిజాంను ఎదిరించిన యోధుడు
- నేడు అమృత్‌లాల్ శుక్లా 33వ వర్ధంతి
- సిరిసిల్ల నియోజకవర్గ రెండో ఎమ్మెల్యే


అమృత్ లాల్ శుక్లా (ఫైల్)

సిరిసిల్ల: దేశవ్యాప్తంగా బ్రిటీష్ పాలన నుంచి స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న రోజుల్లో తెలంగాణ ప్రాంతంలో మాత్రం నిజాం నిరంకుశ పాలన కొనసాగుతోంది. రజాకార్ల దాష్టికాలు.. భూస్వాములకు వెట్టి చాకిరీ ఇక్కడి ప్రజలపై ఆధిపత్యం చెలాయిస్తున్న కాలం. నిజాం నిరంకుశత్వంపై సిరిసిల్ల ప్రాంతంలో ఓ నూనూగు మీసాల యువకుడు పిడికిలెత్తాడు. ఈ ప్రాంతంలో రజాకార్ల ముఠాలను మట్టుబెట్టేందుకు వీరోచిత పోరాటం చేశాడు సిరిసిల్లకు చెందిన అమృత్‌లాల్‌శుక్లా. 1908లో జన్మించిన అమృత్‌లాల్ శుక్లా 83 ఏళ్ల వయసులో జనవరి 14, 1991లో అస్తమించారు. ఆయన 33వ వర్ధంతి సందర్భంగా పోరాట యోధుడి జీవనశైలిపై కథనం.

ఆంధ్ర మహాసభతో కీలక మలుపు

తెలంగాణ విముక్తి ఉద్యమం చురుగ్గా సాగుతున్న దశలో 1935 డిసెంబర్‌లో సిరిసిల్లలో నాల్గో ఆంధ్ర మహాసభ మాడపాటి హన్మంతరావు అధ్యక్షతన జరిగింది. ఈ సభలోని నిర్ణయాలు ఉద్యమ స్వరూపాన్నే మార్చాయి. సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి, బూరుగుల రామకృష్ణారావు, పీవీ నర్సింహారావు, బద్దం ఎల్లారెడ్డి, కేవీ రంగారెడ్డి వారితో జిల్లాకు చెందిన బద్దం ఎల్లారెడ్డి, అమృత్‌లాల్ శుక్లా, చెన్నమనేని రాజేశ్వర్ రావు, గడ్డం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌పై దాడి

త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడమే నేరమైన ఆ రోజుల్లో రజాకార్లపై తిరుగుబాటు చేశారు. పల్లెల్లో రైతు కూలీలను సంఘటితం చేశారు. అమృత్‌లాల్ శుక్లా 1950లో సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌పై దాడిచేశాడు. భూస్వాముల గడీలను లూటీ చేసి, పేదలకు సంపదను పంపిణీ చేశారు. అమృత్‌లాల్‌శుక్లాను నిజాం పోలీసులు నిర్బంధించి 13 ఏళ్ల జైలు శిక్ష విధించగా... చంచల్‌గూడ జైలు నుంచి తరలిస్తుండగా పోలీసుల కళ్లుగప్పి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తప్పించుకున్నారు. అజ్ఞాతంలో ఉంటూ పోరాడారు.

సిరిసిల్ల మలి ఎమ్మెల్యేగా..

హైదరాబాద్ సంస్థానం విలీనం తరువాత.. 1957లో రెండోసారి జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా అమృత్‌లాల్ శుక్లా ఎన్నికయ్యారు. అప్పట్లో కమ్యూనిస్టులపై నిషేధం ఉండడంతో ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) అభ్యర్థిగా పోటీచేసి అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి ఏవీఆర్ రెడ్డిపై విజయం సాధించారు. 85 ఏళ్ల వయస్సులో 1991 జనవరి 14న అస్తమించారు. అమృత్‌లాల్ శుక్లా పోరాట యోధుడిగా చరిత్రలో నిలిచిపోయారు. ఏటా వర్ధంతి సందర్భంగా కమ్యూనిస్టు నాయకులు సిరిసిల్ల మానేరువాగులోని ఆయన స్మారకస్థూపం వద్ద నివాళి అర్పిస్తారు.

నేడు వర్ధంతి సభ

సిరిసిల్ల తొలితరం ఎమ్మెల్యే, స్వాతంత్ర్య సమర యోధుడు అమృత్‌లాల్ శుక్లా వర్ధంతి సభను ఆదివారం నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ తెలిపారు. బీవైనగర్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమృత్‌లాల్ శుక్లా వర్ధంతి సభను తంగళ్లపల్లి మానేరు ఒడ్డున ఆయన స్తూపం వద్ద నిర్వహిస్తున్నామని, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని రమేశ్ కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, నాయకులు ఎలిగేటి రాజశేఖర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఏటా వచ్చే సంక్రాంతికి పండుగల్లో ప్రత్యేక స్థానం ఉంది. మూడు రోజుల ముచ్చటైన పండుగలో సకినాలు ఎంత స్పెషలో.. గాలిపటాల ఆటా అంతే. పాఠశాలలకు సెలవులు మొదలైతే చాలు.. చిన్నారుల్లో ఎక్కడాలేని ఆనందం.. డబ్బాకు దారం.. చేతిలో పతంగి ఉంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు వారికి మరో ధ్యాస ఉండదు. నేలపై నిలుచున్నా.. చూపు మాత్రం ఆకాశంవైపే.. రంగురంగుల పతంగుల విహంగనం.. గగన వీధుల్లో పగటి నక్షత్రాలను మరిపిస్తుంది.

గాలిపటం

- ‘పగటి నక్షత్రాల’ సందడి షురూ
- వీధివీధినా పతంగుల సంబరం
- ఆటలో అప్రమత్తత అవసరం
- జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు దూరం

కరీంనగర్/సప్తగిరి కాలనీ(కరీంనగర్)/సిరిసిల్ల టౌన్/కోల్‌సిటీ/గోదావరిఖని టౌన్(రామగుండం)/జగిత్యాల/గొల్లపల్లి(ధర్మపురి)/జగిత్యాల టౌన్: పతంగుల పండుగ నిజాం కాలంలో గొప్ప ఆదరణ పొందింది. దీని పుట్టుక ఆసక్తికరమే. సముద్ర తీర ప్రాంతాలు, మైదానాలు, ఎడారుల్లో గాలి తీవ్రతను.. వాటాన్ని తెలుసుకునేందుకు ఆ రోజుల్లో తేలికపాటి వస్తువులను గాలిలో ఎగురవేసేవారు. అవే పతంగుల పుట్టుకకు కారణమయ్యాయి. రాజస్థాన్‌లోని అల్వార్‌కు చెందిన మాజీ 1872లో మొదటగా పిల్లల సరదా కోసం పతంగాన్ని ఎగురవేసినట్లు చెబుతారు. అలా ఉత్తరాదిలో పుట్టిన పతంగి దక్షిణాది సంస్కృతిలో భాగమైపోయిందని కథనం. మొఘలులు సైతం పతంగులపై ప్రత్యేక ఆసక్తి కనబరిచారని చరిత్రకారులు చెబుతున్నారు. రాకుమార్తెలు, రాజులు తమ ప్రేమ సందేశాన్ని పంపే సాధానాలుగా వీటిని ఉపయోగిచేవారని పేర్కొంటున్నారు.

పోటాపోటీగా పేంచీలు

గగనతలంలో విహరిస్తున్న గాలిపటానికి పేంచీ వేసి, ఓడించడం ఓ ప్రత్యేకత. ప్రత్యర్థి గాలిపటం ధాటికి తట్టుకోవడానికి గట్టి కరుకుదనం కలిగిన మాంజాను ఉపయోగిస్తారు. పేంచీ వేసి, అవతలి వ్యక్తి పతంగి గాలిలో ఎగిరిపోతుంటే(అఫ్పా) ఎంతగానో ఆనందిస్తుంటారు. అఫ్పా అయిన గాలిపటాన్ని చేజిక్కుంచుకోవడానికి చిన్నారులు, యువకులు పరుగెత్తుతుంటారు.

పలు రంగులు, చక్కని ఆకృతితో..

రాత్రి సమయంలోనే ఆకాశంలో నక్షత్రాలు కనిపిస్తాయి. కానీ సంక్రాంతి వచ్చిందంటే పగలు సైతం నక్షత్రాల వలే పతంగులు దర్శనమిస్తాయి. పలు రంగులు, చక్కని ఆకృతితో ఆకట్టుకునేలా (సినీనటులు, కార్టూన్లు, రాజకీయ నాయకుల చిత్రాలు, చార్మినార్, సీతాకోకచిలుక, చేపల ఆకారంలో) ఉన్న పతంగులు మార్కెట్లో విరివిగా లభిస్తున్నాయి. చిన్నారులను ప్రత్యేకంగా ఆకర్షించేలా ఫిష్‌కటింగ్, చోటాభీమ్, బెన్‌టెన్, యాంగ్రీబర్డ్స్, డోరెమాన్, బాహుబలి వంటి గాలిపటాలు అందుబాటులోకి వచ్చాయి.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

- గాలిపటాన్ని వీలైనంత వరకు మైదానానికి వెళ్లి ఎగురవేయాలి.
- మేడపై, ఓవర్‌హెడ్ ట్యాంకులు, చెట్లపైకి ఎక్కి పతంగి ఎగురవేయడం అత్యంత ప్రమాదకరం.
- విద్యుత్ తీగలకు పతంగి తగలనీయరాదు. పొరపాటున వాటికి చిక్కుకున్నా తీయొద్దు.
- చెట్లపై చిక్కుకున్న పతంగిని కొమ్మపై ఎక్కి తీయడం ప్రమాదకరం.
- దారం తెగి ఎగిరిపోతున్న పతంగిని పట్టుకోవడానికి వీధుల్లో, రహదారులపై పరుగెత్తవద్దు. వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి.
- రైలు పట్టాల సమీపంలో ఎట్టి పరిస్థితుల్లోనూ పతంగిని ఎగురవేయవద్దు.
- చైనా మాంజాను వినియోగించవద్దు. దానితో పక్షుల పాణాలకు ప్రమాదం ఉంది.

సూర్యకిరణాలతో లాభం..

సంక్రాంతి సందర్భంగా సూర్యుడు మకర రాశిలోకి మారుతుంటాడు. ఈ సమయంలో మానవ శరీరంపై భానుని కిరణాలు పడితే వ్యాధి నిరోధక శక్తి పెరిగి, రోగాలను దరిచేయనీయవు.

మాంజా, పతంగుల ధరలు..

పతంగులను ఎగురవేసేందుకు వినియోగించే చైనా మాంజా ఇప్పుడు లభించడం లేదు. వాడొద్దని ప్రభుత్వం నిషేధం విధించింది. పతంగుల పరిమాణం, నాణ్యత, రంగులను బట్టి ధరలు ఉన్నాయి. రూ.5 నుంచి రూ.100 లోపు గాలిపటాలు, రూ.10 నుంచి రూ.300 వరకు మాంజా లభ్యమవుతున్నాయి.

పలు విషాద ఘటనలు..

- హైదరాబాద్ అత్తాపూర్‌లో శనివారం స్నేహితులతో కలిగి గాలిపటం ఎగురవేయడానికి మేడపైకి వెళ్లిన తనిష్క్ (11) విద్యుత్‌షాక్‌తో చనిపోయాడు.
- పాత మంచిర్యాలలోని రాళ్లవాగు బ్రిడ్జిపై రెండేళ్ల క్రితం చైనామాంజాకు తగిలి పస్తం భీమయ్య (40) అనే వలస కూలీ మృతి చెందాడు.
- గతేడాది నల్గొండలో భార్యతో కలిసి ఓ కూలి తన మోపెడ్‌పై వెళ్తుండగా, చైనా మాంజా తగిలి గొంతును కోయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.
- నాలుగేళ్ల క్రితం ఢిల్లీలో ఓ వ్యక్తి తన ఇద్దరు పిల్లలను కారులో తీసుకెళ్తుండగా విండో నుంచి బయటకు చూస్తున్న ఆ పిల్లల గొంతును చైనా మాంజా కోయడంతో ఇద్దరూ చనిపోయారు.

రెండు రోజుల ముందునుంచే..



సంక్రాంతికి రెండు రోజుల ముందునుంచే మేము మా ఇంటి డాబాపై పతంగులను ఎగురవేయడం ప్రారంభిస్తాం. నిజామాబాద్‌లోని ఇంట్లో అందరం కలిసి కైట్ ఫెస్టివల్ జరుపుకుంటాం. – చల్ల స్వరూపారాణి, డిప్యూటీ మేయర్, కరీంనగర్

నాన్నతో పోటీ పడతా..



చిన్నప్పటి నుంచి పతంగులు ఎగురవేయడమంటే ఇష్టం. సంక్రాంతి వచ్చిందంటే నాన్నతో కలిసి ఇంటి డాబాపై ఎగురవేస్తూ ఎంజాయ్ చేస్తా. నాన్నతో పోటీ పడటం సంతోషాన్నిస్తుంది. – పదాల రిషితాప్రసాద్, మెడికో, జగిత్యాల

ఫ్రెండ్స్‌తో కలిసి ఎగురవేస్తా



ప్రతీ సంక్రాంతికి నేను మా ఫ్రెండ్స్‌తో కలిసి పతంగులు ఎగురవేస్తా. పొద్దున ఇంటి ముందు ముగ్గులు వేశాక గాలిపటాలతో ఆడుకుంటాం. చాలా ఆనందంగా ఉంటుంది.

– గుర్రం హరిణి, చొప్పదండి

కోరిన డిజైన్లలో..



కోరిన డిజైన్లలో పతంగులకు ఆర్డర్ ఇచ్చి, తెప్పిస్తున్నాం. సిరిసిల్ల పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మావద్దే కొనుగోలు చేస్తారు. అందరికీ అందుబాటు ధరల్లో విక్రయిస్తున్నాం. – ఎలగందుల రమేశ్, చిరువ్యాపారి, సిరిసిల్ల

ప్రజల్లో అవగాహన రావాలి



నిషేధిత మాంజాను వాడకూడదని ప్రజల్లో అవగాహన రావాలి. వన్యప్రాణుల కోసం క్లినిక్ నిర్వహిస్తున్నాం. జీవాలకు ఆపాయం కలిగితే 96978 87888కు ఫోన్ చేయాలి.

– ప్రదీప్ పరకుత్, రాష్ట్ర అధ్యక్షుడు, యానిమల్ వారియర్స్ కన్జర్వేషన్ సొసైటీ, గోదావరిఖని

చైనా మాంజా ప్రమాదకరం



జగిత్యాల క్రైం: గాలిపటాలు ఎగురవేసేందుకు చైనా మాంజాను వినియోగించడం ప్రమాదకరం. ఇది పక్షులకు, పర్యావరణానికి, మనుషులకు హాని చేస్తుంది. రాష్ట్రంలో ఈ మాంజా పూర్తిగా నిషేధించబడింది.

– సన్‌ప్రీత్‌సింగ్, జగిత్యాల ఎస్పీ



ఆటోయూనియన్ కార్యవర్గం


సన్మానిస్తున్న ప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట్ మండల ఆటో యూనియన్‌ను శని వారం ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా నారాయణపూర్‌కు చెందిన పూదరి దేవరాజు, ఉపాధ్యక్షుడిగా బండలింగంపల్లికి చెందిన బొడ్డు రాజు, రైటర్‌గా ఎల్లారెడ్డిపేటకు చెందిన శ్రవణ్, క్యాషి యర్‌గా శ్రీను, దుమాలకు చెందిన భాస్కర్, కమిటీ సభ్యులుగా దేవానందం, శీతల గోపాల్, జీడి కిషన్‌ను ఎన్నుకున్నారు.